Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

## RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue): 346 పేజీలు (Pages): 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 29 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

# ఇక భారత్‌ను చూసి పాక్ వణకాల్సిందే..




**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం తన ఆయుధ సంపత్తిని పెంచుకోవడంపై భారత్ దృష్టి సారించింది. అందులోభాగంగా రష్యాతో కలిసి బ్రహ్మోస్ క్షిపణులు ఆధునిక వర్షన్ రూపొందించేందుకు భారత్ సమాయత్తమైంది. అందుకోసం ఇప్పటికే రష్యాతో భారత్ చర్చలు జరిపింది. ఈ అంశంపై ఈ ఇరు దేశాలు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ క్రమంలో ఉత్తరప్రదేశ్‌లో రూ. 300 కోట్లతో కొత్త బ్రహ్మోస్ ఫ్యాక్టరీని నిర్మించనున్నారు. అందుకోసం మే 11వ తేదీన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లు యూపీ రాజధాని లక్నోలో బ్రహ్మోస్ ఏరో స్పేస్ సెంటర్‌ను ప్రారంభించారు. 80 హెక్టార్లలో దీనిని ఏర్పాటు చేశారు. భారత్ క్షిపణి సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా దీనిని ప్రారంభించారు. అంతేకాదు.. మేక్ ఇన్ ఇండియాతోపాటు ఆత్మ నిర్భర్ భారత్ వంటి పథకాలకు మరింత ప్రోత్సహించేందుకు ఇది సహాయ పడుతుందని తెలుస్తుంది. భారత్‌లో బ్రహ్మోస్ క్షిపణుల ఉత్పత్తి పెరిగే కొద్ది అయ్యే వ్యయం భారీగా తగ్గనుంది. అలాగే గతంలో వీటికి సంబంధించిన వీడి భాగాలు దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. దీంతో భారీగా ఖర్చుయ్యేది. కానీ బ్రహ్మోస్ క్షిపణులు భారత్‌లోనే తయారు చేసుకోవడంతో.. వాటి విడి భాగాలను సైతం దిగుమతి చేసుకోవాల్సిన అవసరం ఇకపై ఉండదు. ఈ సంస్థను ఏర్పాటు చేయడం వల్ల స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అంతేకాకుండా.. వీటిని ఎగుమతి చేసే స్థాయికి భారత్ చేరుకోనుంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ సైతం బలోపేతమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. పాకిస్థాన్.. తన పొరుగు దేశమైన భారత్‌పై తన తెంపరితనాన్ని చాటుకుంటుంది. ఈ విషయం ఇప్పటికే పలుమార్లు స్పష్టమైంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని మొత్తం 21 ప్రాంతాల్లోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడి చేసి పూర్తిగా ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా నిర్వహించిన దాడుల్లో బ్రహ్మోస్ క్షిపణులు క్రియాశీలకంగా వ్యవహరించాయి. బ్రహ్మోస్ క్షిపణుల శక్తి గురించి యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తనదైన శైలిలో ఇటీవల స్పందించారు. క్షిపణి దాడుల్లో బ్రహ్మోస్ క్షిపణులు క్రియశీలకంగా వ్యవహరించాయన్నారు. ఈ క్షిపణి శక్తిని మీరు చూడకుంటే.. పాకిస్థాన్ ప్రజలను అడిగి తెలుసుకోడంంటూ ఆయన చమత్కరించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా రావల్పిండి సమీపంలోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌తోపాటు బావల్‌పూర్‌లోని జైషే మహమ్మద్ స్థావరంపై దాడి చేయడంతో.. అవి పూర్తిగా ధ్వంసమైనాయి. ఇక భారత్ అమ్ములపొదిలో బ్రహ్మోస్ అధునిక వర్షన్ ఉంటే.. పాకిస్థాన్ ఇకపై పొరుగుదేశంతో చాలా జాగ్రత్తగా వ్యవహరించడం ఖాయమనే చర్చ జరుగుతోంది. బ్రహ్మోస్ క్షిపణులు రేంజ్ 290 నుంచి 400 కిలోమీటర్ల మేర ఉంటుంది. ఇవి 2.8 మాక్ వేగాన్ని కలిగి ఉంటుంది. వీటిని పాకిస్థాన్‌తోపాటు చైనా అంబులపొదిలోని ఆయుధాలు ఆపలేవు. భారత్ వీటిని భూమి ఉపరితలం నుంచి ఉపరితలంపైకి, నౌకలపై నుంచి భూ ఉపరితలంపైకి.. అలాగే గాలిలో సైతం ఇవి దాడి చేస్తాయి. ఈ క్షిపణులు శబ్ద వేగం కంటే మూడు రెట్ల వేగంతో వెళ్తాయి.

# మా లక్ష్యం ఇదే.. బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది.. చంద్రబాబు సెన్సేషనల్ కామెంట్స్



**కడప, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏకగ్రీవంగా మరోసారి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహానాడులో ఆయన మాట్లాడుతూ.. ఇంతవరకు శక్తిమేర పార్టీని సమర్ధంగా నడిపానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నా బలం, బలగం.. టీడీపీ నాయకులు, కార్యకర్తలేనని పేర్కొన్నారు. ఇంతవరకు జరిగిన అన్ని మహానాడుల కంటే కడప మహానాడు ప్రత్యేకమన్నారు.

**వారిని వదిలిపెట్టం**

తెలుగుజాతి ఉన్నంతవరకు టీడీపీ ఉంటుందని, రానున్న 40 ఏళ్లకు ప్రణాళికలు రూపొందించుకున్నామని స్పష్టం చేశారు. ఫ్యాక్షనిజం, నక్సలిజాన్ని తుదముట్టించిన పార్టీ టీడీపీ అన్నారు. గత ఐదేళ్లు ఏపీలో శాంతిభద్రతలు లేవని, వైసీపీ హయాంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబాయిని హత్య చేసి ఆ నింద మనపై మోపాలని చూశారని అయితే తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదన్నారు. తప్పు చేసిన వారిని ఎట్టిపరిస్థితిలోనూ వదిలిపెట్టేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.

**సస్యశ్యామలం చేస్తాం**

ఈ నేపథ్యంలో ఏపీలో గంజాయిని పూర్తిగా నియంత్రిస్తామన్నారు. శాంతిభద్రతలను ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. తప్పు చేసినవారి పట్ల చండశాసనుడిలా ఉంటానని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమకు ద్రోహం చేసిన పార్టీ వైసీపీ అని ఫైర్ అయ్యారు. రాయలసీమను ఎడారి కానివ్వమని, రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. అలాగే, 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని చంద్రబాబు తెలిపారు.

**బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం**

బనకచర్ల వరకు నీరు తేవాలన్నదే తమ లక్ష్యమన్నారు. నదుల అనుసంధానం పూర్తి చేస్తామని, నదీ జలాల వినియోగంలో ఏపీ చివరి రాష్ట్రమని, నదుల అనుసంధానంతో తెలంగాణకూ లాభమేనని చంద్రబాబు వివరించారు. ఈ అంశంలో బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. బనకచర్లతో తెలంగాణకు ఎలాంటి నష్టం జరగదని, సముద్రంలోకి పోయే నీటిని వాడుకుంటే తప్పేంటి? అని చంద్రబాబు ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణ తనకు రెండు కళ్లు వంటివి అని చంద్రబాబు పేర్కొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండపడ్డారు. తమ ప్రభుత్వం హయాంలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయని ఆయన వ్యంగ్యంగా అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బాబూ జగజ్జీవన్‌రామ్ భవన్‌లో ఎస్సీ గురుకులాల్లో టెన్త్, ఇంటర్ చదివి.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీకి ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన నిలదీశారు. పీజీలు చేసిన విద్యార్థులు ఎంతో విలువైన కాలాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న పిల్లలకు తాము ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. ఒక్క ఏడాదిలోనే 59 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. గత 15 ఏళ్లుగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదన్నారు. తమ హయాంలో 563 గ్రూప్-1 పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. గ్రూప్-1లో 89% పోస్టులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కాయని సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఇంకా సీఎం రేవంత్ రెడ్డి ఏమన్నారంటే.. ఈ రోజు అంటే బుధవారం తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి అని గుర్తు చేశారు. వారి స్ఫూర్తిని కొనసాగించేందుకు తెలుగు యూనివర్సిటీకి వారి పేరు పెట్టుకున్నామన్నారు. కోటిలోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నామని తెలిపారు. ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారని ఆయన స్పష్టం చేశారు. జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు. మంచి చదువుతోనే అందరికీ గుర్తింపు వచ్చిందని చెప్పారు. ఆత్మనూన్యత భావాన్ని వీడాలంటూ దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. వారిలోని ఆత్మనూన్యత భావాన్ని తొలగించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బర్రెలు, గొర్రెలు, చేపలు వంటి స్కీములు తెచ్చారని గుర్తు చేశారు. కానీ మీకు చదువు చెప్పి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తామని ఎందుకు చెప్పలేదంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది వాస్తవం కాదా? అని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కానీ మేం మొదటి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. మొదటి ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. అంతేకాదు గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేశామన్నారు. కానీ నోటికాడి కూడును కింద పడేసినట్లు.. రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని గత ప్రభుత్వ పెద్దలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో గ్రూప్ 1 పరీక్షలు కూడా నిర్వహించని పార్టీలు కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారన్నారు. అందుకే ఇది సామాజిక సమస్యగా మారుతోందని పేర్కొన్నారు. వాళ్లింట్లో ఎన్నికల్లో ఓడిపోతే ఆరు నెలలు తిరగకుండానే ఇంకో ఉద్యోగం ఇచ్చుకున్నారని బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కానీ మీకు మాత్రం ఉద్యోగాలు రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. అలాంటి వారు మీకు ఎదురైతే ప్రశ్నించండంటూ యువతకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మొదటి పాతికేళ్ల వయసు వరకు బాగా చదువుకుంటేనే మీరు మీ జీవితంలో రాణిస్తారన్నారు. తప్పుదారి పడితే కన్న తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి ఉంటుందని విద్యార్థులకు ఆయన కీలక సూచన చేశారు. అలాంటి పరిస్థితులు ఎప్పుడూ తెచ్చుకోవద్దంటూ విద్యార్థులకు హితవు పలికారు. కష్టపడండి.. సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో రాణించి తల్లిదండ్రులకే కాదు.. రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో తొలి సారిగా దళితుడిని వైస్ చాన్స్‌లర్‌గా నియమించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళిని నియమించామని గుర్తు చేశారు. అలాగే అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రజా ప్రభుత్వంలో ఎంపిక చేసుకున్నామని వివరించారు. వీరందరికీ కేవలం కులం ప్రాతిపదికన గుర్తింపు రాలేదు.. చదువుకున్నారు కాబట్టే వారికి ఈ గుర్తింపు వచ్చిందని విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందన్నారు. అన్ని రంగాల్లో మీరు రాణించాలని మనస్ఫూర్తిగా తాను కోరుకుంటున్నానని తెలిపారు. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# త్రికరణ శుద్ధితో కార్యాచరణ చేసిన వ్యక్తి ఎన్టీఆర్




**అమరావతి, (రాజధాని వార్తలు):** దివంగత స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా తెలుగు రాష్ట్రాలలో టీడీపీ నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్నారు. ఈ సందర్భంగా జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ చరిత్ర అజరామరం అని అన్నారు. త్రికరణ శుద్ధితో చేసే ఏ కార్యమైనా సత్ఫలాన్ని ఇస్తుందని తాను విశ్వసిస్తానని.. అటువంటి త్రికరణ శుద్ధితో కార్యాచరణ చేసిన వ్యక్తి స్వర్గీయ నందమూరి తారకరామారావు అని అన్నారు. మనసు, మాట, కర్మ (పని) మూడు అంశాలు సమన్వయం చేసుకొంటూ పని చేయడం ఆయనలో తాను గమనించానని, అందుకే వేషం వేసినా, రాజకీయం ఆచరించినా, ప్రజాసేవ చేసినా ఎన్టీఆర్ సత్ఫలితాలను సాధించారని కొనియాడారు. నటుడిగా, రాజకీయ నేతగా, పరిపాలనాధ్యక్షునిగా.. చరిత్ర పుటలు నుంచి చెరిపివేయలేని చరిత్ర ఆయనదని.. ఈరోజు ఆ మహామనిషి, కళా ఋషి జయంతి సందర్భంగా ఆయనకు పుష్పాంజలి అర్పిస్తున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

**మహానాడు అన్న పదం విన్నా, చదివినా..**

కాగా 'మహానాడు అన్న పదం విన్నా, చదివినా వెంటనే గుర్తుకు వచ్చేది తెలుగుదేశం పార్టీయేనని.. అంతలా తెలుగువారి గుండెల్లో స్థిరపడిపోయింది' అని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మహానాడు సందర్భంగా ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. 'కడపలో అంగరంగ వైభవంగా మహానాడు చారిత్రక రాజకీయ పండుగ ప్రారంభమైన శుభవేళ నా పక్షాన, జనసేన పక్షాన టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు. చంద్రబాబు నాయకత్వంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులుగా సేవలు అందిస్తున్న పల్లా శ్రీనివాస్, బక్కని నరసింహులుకు శుభాభినందనలు. ఈ మూడు రోజుల వేడుకలో చర్చించనున్న ఆరు అంశాలు ప్రశంసనీయంగా ఉన్నాయి. కార్యకర్తే అధినేత, యువగళం, స్త్రీ శక్తి, సామాజిక న్యాయం, పేదల ప్రగతి, అన్నదాతకు అండ వంటి అంశాలపై చర్చించి తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించడం అభినందనీయం. ఈ వేడుక విజయవంతంగా జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

# పులివెందులలో రెచ్చిపోయిన వైసీపీ శ్రేణులు




**కడప, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఓ వైపు టీడీపీ మహానాడు అంగరంగ వైభవంగా జరుగుతున్న వేళ వైసీపీ శ్రేణులు రెచ్చిపోయారు. దీంతో పులివెందుల్లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. మహానాడు సందర్భంగా పులివెందులలో టీడీపీ శ్రేణులు పార్టీ జెండాలు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వైసీపీ శ్రేణులు తమ అక్కసును బయటపెట్టారు. పులివెందులలో తెలుగు తమ్ముళ్లు ఏర్పాటు చేసిన తెలుగుదేశం మహానాడు జెండాలను, బ్యానర్లను వైసీపీ శ్రేణులు పీకేశారు. అయితే టీడీపీ శ్రేణుల మాత్రం ఎలాంటి గొడవలకు పోకుండా.. వైసీపీ తీసివేసిన జెండాలను, బ్యానర్లను తిరిగి కట్టుకున్నారు. ఈ క్రమంలో రెచ్చిపోయిన వైసీపీ కార్యకర్తలు.. 'మళ్లీ పీకుతాం ఏమి చేస్తారో చేసుకోండి' అంటూ బ్యానర్లను పీకేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పులివెందుల వైసీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు భారీగా గుమిగూడారు. వైసీపీ శ్రేణుల హంగామా నేపథ్యంలో టీడీపీ కార్యాలయం వద్దకు ఆ పార్టీ కార్యకర్తలు భారీగా చేరుకుంటున్నారు. ఈ పరిస్థితులను గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు పులివెందులలో వైసీపీ బీభత్సం గురించి తెలుసుకున్న టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి మహానాడు ప్రాంగణం నుంచి పులివెందులకు బయలుదేరి వెళ్లారు. పులివెందులలో టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలు పీకి వేయడంపై అక్కడ కార్యకర్తలు నిరసన తెలుపుతున్నారు. వైసీపీ పీకేసిన జెండాలను టీడీపీ కార్యకర్తలు కట్టినప్పటికీ మళ్లీ పీకేస్తామంటూ హడావుడి చేస్తూ పులివెందుల వైసీపీ ఆఫీసుకు ఆ పార్టీ కార్యకర్తలు చేరుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న వెంటనే బీటెక్ రవి పులివెందులకు బయలుదేరారు. టీడీపీ కార్యాలయం వద్దకు రవి వస్తున్నాడని తెలిసి తెలుగు దేశం టీడీపీ కార్యకర్తలు, నేతలు భారీగా చేరుకుంటున్నారు. తాను పులివెందుల వెళ్ళి తేల్చుకుంటానని బీటెక్ రవి చెబుతున్నారు.

# వేసవి విజ్ఞాన తరగతులు










**కాకినాడ, (రాజధాని వార్తలు):** పౌర గ్రంథాలయ శాఖా సంచాలకుల వారి ఆదేశములు మరియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథా లయ సంస్థ కార్యదర్శి వారి ఉత్తర్వులు ప్రకారం జిల్లా కేంద్ర గ్రంథాలయం, కాకినాడలో ది 27/05/2025వ తేదీన వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులచే ఉదయం 8 గం.ల నుండి 8:30 గం.ల వరకు పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. 8:30 గం.ల నుండి 9:15 గం.ల వరకు డిఆర్‌డిఏ శిక్షణా నిపుణులు సత్య బాల విద్యార్థులకు కమ్యూ నికేషన్ స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగినది. 9:15 గం.ల నుండి 10:00 గం.ల వరకు విశ్రాంత ఉపాధ్యా యులు సూర్యనారాయణ విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ మరియు ఓరిగామిపై శిక్షణ ఇవ్వడం జరిగింది. 10:00 గం.ల నుండి 10:10 గం.ల వరకు విద్యార్థినీ విద్యార్థులకు విరామం అల్పా హారం పంపిణీ చేయడం జరిగినది. 10:10 గం.ల నుండి 11:00 గం.ల వరకు ఏఎంజి స్కూల్ ఉపాధ్యాయులు చిన్నబాబు విద్యా ర్థులకు చిత్రలేఖనం తరగతులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి ఐ/సి కిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది రాజు, నాగేంద్ర కుమార్, దుర్గా ప్రసాద్, అరుణ, ప్రియదర్శిని మరియు స్థానిక పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు 55 మంది పాల్గొనడం జరిగినది.

## శని ప్రార్థనతో సర్వ దోష నివారణ




**కాకినాడ, (రాజధాని వార్తలు):** శని ప్రార్థన సకల దోషాల నుండి రక్షించేందుకు ఎంతో అవకాశం ఉంటుందని వేద పండితులు యాతగిరి మద్వేష్ అన్నారు. శనేశ్వర జయంతి సందర్భంగా శతాబ్దాల ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న చొల్లంగి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని శనేశ్వర విగ్రహానికి మంగళవారం నాడు తైలాభిషేక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైశాఖ అమావాస్య అందున మంగళవారం కలిసి రావడం అత్యంత శుభప్రదమైనదని మద్వేష్ అన్నారు నవగ్రహాలలో అత్యంత ఆరాధన మూర్తిగా ప్రసిద్ధి కెక్కిన శనీశ్వర స్వామి నిత్యాస్మరణీయులని మనం చేసే ప్రతి కర్మ విజయవంతము అవ్వాలంటే శని ప్రార్థన అవశ్యమని అన్నారు. సూర్య భగవానుని పుత్రునిగా మనం ఆరాధిస్తామని సూర్య దర్శనం ద్వారా మనకు ఆయురారోగ్యము కలుగుతాయని చెప్పారు. నిత్యము నవగ్రహ స్తోత్రం పటణం చేయడం ద్వారా సకల శుభాలు పొందవచ్చు అన్నారు. జాతకములో ఏలినాటి శని మరియు అర్ధాష్టమి శని సంచార సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ కర్మ ఫలాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించి తీరాల్సిందేనని అయితే శనీశ్వర ప్రార్థన ద్వారా ఆ ఉపద్రవాన్ని తగ్గించుకోవడానికి ఎంతో అవకాశం ఉందన్నారు. ప్రతినిత్యము ఆంజనేయ స్వామి మరియు విఘ్నేశ్వరంలను ప్రార్థించడం ద్వారా శని భగవాన్‌కి ఎంతో ప్రీతికరమని మరియు త్రిమూర్తుల ఆరాధన కూడా ఎంతో అవసరమని చెప్పారు. చొల్లంగి ఆంజనేయస్వామి ఆలయ వంశపారంపర్య ప్రధాన అర్చకులు గండికోట సుదర్శన్ మాట్లాడుతూ సాగర సంగమ క్షేత్రంలో చంద్రుడు తపస్సు చేసిన ప్రాంతంగా చొల్లంగిని పురాణాలలో ప్రస్తావిస్తారని అంతటి మహిమ కలిగిన ఈ ప్రాంతంలో శని దోష నివారణకు అనేక కార్యక్రమాలను తాము స్వయంగాను మరియు వేద పండితుల సహకారముతో క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్నో శతాబ్దాల క్రితం గురు రాఘవేంద్ర స్వామి మృత్తిక బృందావనం ఈ ప్రదేశంలో ఉండేదని కారణాంతరాల వల్ల ఆలయ ప్రాంగణంలోకి మార్చడం జరిగిందని అంతటి పవిత్రమైన ప్రదేశంలో శనీశ్వరుని విగ్రహాన్ని ప్రతిష్టించడం మన ప్రాంత భక్తుల అదృష్టంగా సుదర్శన్ ప్రస్తావించారు. గురువుల అనుగ్రహం ద్వారా సకల దేవతల యొక్క అనుగ్రహాన్ని మనం తప్పకుండా పొందవచ్చని అనేక దృష్టాంతరాలు ఉన్నాయని సుదర్శన్ వివరించారు. మంగళవారం సందర్భంగా మీ స్వామికి సింధూరము మరియు తమలపాకు పూజ కూడా విశేషంగా జరిగిందని చెప్పారు భక్తులు సహకారంతో పుష్పాలంకరణ చేసినట్టు నీవు వివరించారు. ఆలయంలో భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేయడం వల్ల ఏ విధమైన ఇబ్బంది లేకుండా దైవదర్శనం చేసుకుని భక్తులు దైవ దర్శనం చేసుకున్నారని చెప్పారు? విశ్రాంతి ఉపాధ్యాయులు పన్యాల నరసింహారావు (బుజ్జి) మాట్లాడుతూ చొల్లంగి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మధ్వ గురువుల మృత్తిక బృందావనాలు ఉండటం గొప్ప అదృష్టంగా ప్రస్తావించారు ఈ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి, బృందావనాలు, విఘ్నేశ్వర స్వామి, మరియు నాగదేవత విగ్రహాలు ఉండటం మనందరి అదృష్టంగా చెప్పారు.

## వీధి నాటకం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన





**రవికమతం, (రాజధాని వార్తలు):** జాతీయ ఎయిడ్స్ నివారణ సంస్థ మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో డిఎల్ఓ బాలాజీ గారు అనకాపల్లి లో మే 8వ తేదీన ప్రారంభించడం జరిగింది సమిద స్వచ్ఛంద సంస్థకు ఇచ్చినటువంటి షెడ్యూల్ ప్రకారం మే 14వ తేదీ నుండి మే30 వరకు ఇవ్వడం జరిగింది మే14వ తేదీన కళాంజలి కళా బృందం వారిచే గొలుగొండ ఎస్సీ కాలనీ నందు మే 15వ తేదీన వై వెంకటేశ్వర కళాబృంద వారిచే, పాకరావుపేట అంబేద్కర్ కాలనీ నందు మే 20వ తేదీన అబీద్ సెంటర్ నర్సీపట్నం నందు వై వెంకటేశ్వర కళాబృంద వారిచే మరియు మాకవరపాలెం మార్కెట్ నందు కళాంజలి కళాబృందం వారిచే మే 23వ తేదీన బొడ్డేపల్లి కాపు వీధి నందు వై వెంకటేశ్వర కళాబృందం వారిచే మే 27వ తేదీన కళాంజలి కళాబృందం వారిచే కొత్తకోట మార్కెట్ నందు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది వీధి నాటకం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, సుఖ వ్యాధులు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించలో తదితర విషయాలను నాటకం ద్వారా వివరించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో సమిద స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డి వీరభద్రరావు మరియు ప్రాజెక్ట్ మేనేజర్ వరహాలు బాబు, సంధ్యారాణి, ఏఎన్ఎం లక్ష్మి ఔట్రిచ్ వర్కర్స్ మరియు పీర్ ఎడ్యుకేటర్స్ అంగన్వాడి సిబ్బంది ఆశ వర్కర్స్ సచివాలయం సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది

## సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సిఐటియు మద్దతు

### - ప్రభుత్వం స్పందించి సమ్మె డిమాండ్స్ పరిష్కరించాలి



**కాకినాడ, (రాజధాని వార్తలు):** పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్న నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ కార్మికులకు సిఐటియు కాకినాడ నగర కమిటీ తరపున కో కన్వీనర్ పలివెల వీరబాబు మద్దతు తెలిపారు. మంగళవారం భిక్షాటన చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులను కలిసి మద్దతు ప్రకటించి మాట్లాడారు. కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో వాటర్ వర్క్స్ ఇండోర్ మరియు అవుట్ వర్కర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, వర్క్ ఇన్స్పెక్టర్స్, వీధి దీపాల నిర్వహణ ఎలక్ట్రికల్ వర్కర్స్, పార్క్ మజ్దూర్, సెక్యూరిటీ గార్డ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. మే 7వ తేదీ నుండి 14వ తేదీ వరకు నిరసన తెలియచేసి విధులకు హాజరైన కార్మికులు 15వ తేదీ నుండి సమ్మె చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం సమంజసంగా లేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులు సిబ్బంది మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె పరిష్కరించాలని సిఐటియు డిమాండ్ చేస్తోందన్నారు.

## యానాం నుంచి పోటీ పడుతున్న 18 జట్లు







**యానాం, (రాజధాని వార్తలు):** యానాం ఎంకెఆర్ ప్రేమియర్ లీగ్ వైట్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ని గౌరవనీయులు మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజు సందర్భంగా మల్లాడి అభిమాన సంఘం వారు నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం యానాం నుంచి 18 జట్లు పోటీ పడుతున్నాయి. విన్నర్‌కి 30 వేల రూపాయలు రన్నర్స్‌కి 20 వేల రూపాయలు 3వ ప్లేస్‌కి పదివేల రూపాయలు ప్రైజ్ మనీ ఇస్తున్నారు. ఈ మ్యాచ్లు ప్రారంభోత్సవానికి మల్లాడి అభిమాన సంఘం నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సూర్య ప్రకాష్, యానం ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లాడి శామ్యూల్, గుత్తుల జయరామారావు, మాజీ సీఐ శివ గణేష్, పంతగడ రమేష్ నాయుడు, దుర్గబాబు, సుమన్, మల్లవరపు దయ, కాలాడి నాగూర్ (రంజి ప్లేయర్), చింత అజయ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు.

## నియోజకవర్గంలో యోగాంధ్ర కార్యక్రమాలు






**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజక వర్గ పరిధిలోని సామర్లకోట, పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయాల్లో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 21న విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా 11వ అంతర్జాతీయ యోగాంధ్ర నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు సామర్లకోటలో మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్రలో భాగంగా యోగా శిక్షణ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా యోగ ట్రైనర్స్‌చే వివిధ రకాల యోగాసనాలను చేయించి సిబ్బందికి, ప్రజలకు శిక్షణ ఇచ్చారు.

అలాగే పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో లు కె హిమ మహేశ్వరి, డి శ్రీ లలితలు మాట్లాడుతూ ప్రతివారు యోగా శిక్షణాల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కార్యాలయాల సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## నూతన హిందూ స్మశాన వాటికలో ప్రారంభమైన అభివృద్ధి పనులు



**అన్నవరం, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా అన్నవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్మశాన వాటికలో సోమవారం నుంచి పనులు ప్రారంభించారు. ముందుగా అక్కడ ఉన్న మామిడి చెట్టు, వేరే చెట్లు తొలగించి భూమిని చదును చేయుట మొదలు పెట్టారు. పంచాయితీ ప్రెసిడెంట్ ఎస్.కుమార్ రాజా మరియు ఈవో వి. చక్రవర్తి, వార్డు సభ్యుల చొరవతో ఈ పని ప్రారంభించారు.

## కమిషనర్‌ను కలిసిన హెచ్‌పి గ్యాస్ మేనేజింగ్ పార్టనర్

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్ రెడ్డి నూతనంగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో పెద్దాపురం పట్టణానికి చెందిన శ్రీ గంగా హెచ్.పీ గ్యాస్ మేనేజింగ్ పార్టనర్ తలాటం గంగాధరరావు సోమవారం మున్సిపల్ కమీషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

పుష్పగుచ్ఛంతో కమిషనర్‌ను అభినందించి పరిచయం చేసుకున్నారు.

ఈ సందర్భంగా పట్టణ పరిధిలో హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీలో ఉన్న కనెక్షన్‌లు, దీపం పథకం ద్వారా కొనసాగుతున్న కనక్షన్లు వివరాలను కమిషనర్‌కు గంగాధర్ వివరించారు. కాగా ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందించాలని గంగాధరరావుకు మున్సిపల్ కమిషనర్ సూచించారు.

# రాజమౌళి తర్వాత మహేష్‌కు బెస్ట్ ఛాయిస్ ఎవరు?



సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియన్ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న SSMB29 సినిమా 1000 కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటుండటం, ఈ ప్రాజెక్ట్‌పై ఉన్న అంచనాలను ఇప్పటికే ఆకాశానికెత్తేశాయి. పాన్ వరల్డ్ స్థాయిలో తెరకెక్కుతోన్న ఈ అడ్వెంచర్ థ్రిల్లర్ మహేష్ కెరీర్‌లో గేమ్‌చేంజర్ అవుతుందని ఇండస్ట్రీ వర్గాల అంచనా. ఇలాంటి భారీ ప్రాజెక్ట్ తర్వాత మహేష్ ఏ దర్శకుడితో సినిమా చేయనున్నాడనే చర్చ ఇప్పుడు ఫిలింనగర్‌లో హాట్ టాపిక్ అయింది. ఎందుకంటే, రాజమౌళి తర్వాత వచ్చే చిత్రం అంచనాల పరంగా రెండింతలు భారీగా ఉండాలి. ప్రేక్షకుల దృష్టిలో మహేష్‌ను కొత్తగా చూపించగల దర్శకుడితోనే ఆయన ముందుకు సాగాలి. ఈ క్రమంలో కొంతమంది దర్శకుల పేర్లు హాట్ టాపిక్‌గా మారాయి. సందీప్ రెడ్డి వంగా, నాగ్ అశ్విన్, బుచ్చిబాబు వంటి వారి పేర్లు గట్టిగానే వినిపిస్తున్నాయి. వీళ్లలో ఒకరితో మహేష్ బాబు తదుపరి సినిమా పట్టాలెక్కే అవకాశం ఉందని సమాచారం. ఈ ముగ్గురు దర్శకులు ముగ్గురూ డిఫరెంట్ స్టైల్‌తో ఆకట్టుకునేవారే. సందీప్ రెడ్డి వంగా అయితే కథనాన్ని డార్క్‌గా నడిపిస్తూ, హీరో పాత్రలో ఎమోషనల్ డెప్త్ చూపించడంలో ప్రత్యేకత ఉన్నవాడు. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, అనిమల్‌లాంటి సినిమాలు దీనికి నిదర్శనం. మహేష్‌తో ఈయన సినిమా అంటే, ఓ ఇంటెన్స్ పాత్రలో సూపర్ స్టార్‌ను చూడొచ్చు. అటు నాగ్ అశ్విన్ విషయానికి వస్తే, వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో మంచి పేరు సంపాదించాడు. మహానటి, పాన్ ఇండియా మూవీ ‘కల్కి 2898AD’ చూస్తే, విజువల్ గాంభీర్యాన్ని ఎలా మలుచుకోవాలో తెలిసినవాడు. మహేష్‌తో ఓ విజువల్ వండర్ రానున్నదన్న అంచనాలు తటస్థంగా ఉంటాయి. ఇక బుచ్చిబాబు సాన, ఉప్పెన సినిమాతోనే ఇండస్ట్రీలో తన మార్క్ చూపించాడు. రామ్ చరణ్‌తో చేస్తున్న పెద్ది ప్రాజెక్ట్‌పై ఇప్పటికే మంచి బజ్ ఉంది.

బుచ్చిబాబు స్టైల్ చూస్తే, మాస్, క్లాస్ కలిపి గట్టిగా మిడిల్ క్లాస్ భావోద్వేగాలు చెప్పడంలోనూ దిట్ట. మహేష్‌ను కొత్తగా, సాధారణ ప్రజల పక్కన ఉన్న వ్యక్తిగా చూపించగల డైరెక్టర్ అనిపించేది ఇతనే కావొచ్చు.

మొత్తానికి, ముగ్గురిలో ఎవరు ఎంపికవుతారో తెలియదు కానీ ఒక విషయం మాత్రం ఖచ్చితం – రాజమౌళి తర్వాత మహేష్ చేయబోయే సినిమా అతని కెరీర్‌లో మరో కీలక మలుపుగా నిలుస్తుంది. అభిమానులు మాత్రం ఆయనను ఓ మాస్ – క్లాస్ మిక్స్ స్టోరీలో చూడాలని ఆశిస్తున్నారు. ఈ ముగ్గురు డైరెక్టర్స్‌లో ఎవరిదైనా కానీ, మహేష్‌ను కొత్తగా, భారీగా చూపించడంలో ఏమాత్రం తగ్గకుండా ఉంటారన్నది మాత్రం గ్యారంటీ.

# ‘సలార్’ మళ్లీ నెం.1... ఇదే సాక్ష్యం



ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన ‘సలార్’ సినిమా 2023 డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కేజీఎఫ్ సినిమా సూపర్ హిట్ నేపథ్యంలో సలార్ సినిమాపై మొదటి నుంచి అంచనాలు భారీగా పెరిగాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సలార్ సినిమాను భారీ యాక్షన్ సన్నివేశాలతో ప్రశాంత్ నీల్ రూపొందించాడు. ప్రభాస్ ఫ్యాన్స్ మాత్రమే కాకుండా అన్ని భాషల్లోనూ యాక్షన్ సినిమాలను ఇష్టపడే వారు ఈ సినిమాను తెగ ఆధరించారు. దాంతో థియేట్రికల్ రిలీజ్ అయ్యి దాదాపుగా వెయ్యి కోట్ల వసూళ్లు రాబట్టగా, ఓటీటీ స్ట్రీమింగ్‌లో ఎన్నో రికార్డ్‌లను ఈ సినిమా దక్కించుకుని అరుదైన సినిమాగా నిలిచింది. సాధారణంగా అన్ని సినిమాలు ఒకటి లేదా రెండు ఓటీటీల్లో మాత్రమే స్ట్రీమింగ్ అవుతూ ఉంటాయి. కానీ ఈ సినిమా ఏకంగా ఏడు ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌లో స్ట్రీమింగ్ అయింది. థియేట్రికల్ రిలీజ్ అయిన నెల రోజుల తర్వాత ఓటీటీ స్ట్రీమింగ్ మొదలు పెట్టిన సలార్ అన్ని భాషల్లోనూ విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ మధ్య కాలంలో ఓటీటీ ప్లాట్ ఫామ్స్ ఎక్కువగా ఆన్‌డ్రాయిడ్ టీవీల్లో వాడుతూ ఉన్నారు. మొబైల్‌లో ఓటీటీలను వినియోగించడం కాస్త తక్కువే అని చెప్పాలి. అయితే సలార్ సినిమా మొబైల్ స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్‌లలో అత్యధికంగా చూడబడిన సినిమాగా నిలిచింది అంటూ నిల్సన్ అనే సంస్థ సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో, జియో హాట్ స్టార్, సోనీ లివ్, జీ5, ఎంఎక్స్ ప్లేయర్ ఇలా పలు భాషల్లో వివిధ భాషల్లో సలార్ అందుబాటులో ఉంది. లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణాల్లో 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్కులు మొబైల్ ద్వారా సలార్ సినిమాను చూసినట్లుగా నిల్సన్ సర్వేలో వెల్లడి అయింది. మొబైల్ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ ల్లో ఎక్కువగా వెబ్ సిరీస్‌లను చూస్తూ ఉంటారని, ఆ తర్వాత ఇంగ్లీష్ వెబ్ సిరీస్‌లను చూస్తూ ఉంటారు. కానీ మార్చి 2025 లెక్కల ప్రకారం సలార్ సినిమాను మొబైల్ స్క్రీన్‌పై అత్యధికులు చూశారని వెల్లడి అయింది. ప్రభాస్ అభిమానులు ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రముఖంగా షేర్ చేస్తూ సందడి చేస్తున్నారు. సలార్ సినిమా పార్ట్ 1 లో మిగిలి ఉన్న ప్రశ్నలకు పార్ట్ 2 లో సమాధానం చెప్పాల్సి ఉంది.

ఎన్నో ప్రశ్నాలకు ప్రశాంత్ నీల్ సలార్ 2లో సమాధానం ఇస్తాడని అభిమానులు, సినీ ప్రేమికులు, ప్రేక్ష కులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కానీ ప్రశాంత్ నీల్ ప్రస్తుతం ఎన్టీఆర్ సినిమాతో బిజీగా ఉన్నాడు. దాంతో ప్రభాస్, ప్రశాంత్ నీల్ కాంబో ‘సలార్ 2’ ఎప్పుడు మళ్లీ సెట్స్ పైకి వెళ్తుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తు న్నారు. మెజార్టీ పార్ట్ షూటింగ్ పూర్తి చేసి ఉంటాడని కొందరు అంటూ ఉంటే, సలార్ 2 సినిమా షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదని కొందరు అంటున్నారు. మొత్తానికి సలార్ విడుదలై దాదాపు రెండేళ్లు కావస్తున్నా వార్తల్లో నిలుస్తూనే ఉంది.

# దీపికా పదుకొణె.. ఇది అస్సలు కరెక్ట్ కాదు!



టాలెంటెడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పిరిట్ మూవీ వర్క్స్‌తో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతుండగా.. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ను స్టార్ట్ చేయనున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. సెట్స్‌లోకి వచ్చేందుకు ప్రభాస్ కూడా రెడీ అవుతున్నారు! అదే సమయంలో రీసెంట్‌గా సందీప్ వంగా హీరోయిన్ పేరు అనౌన్స్ చేశారు. స్టార్ బ్యూటీ దీపికా పదుకొణెను ఫిమేల్ లీడ్ నుంచి తప్పించారు. యానిమల్ మూవీతో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న త్రిప్తి డిమ్రీని హీరోయిన్‌గా ఫిక్స్ చేశారు. దీంతో దీపికాను ఎందుకు తప్పించారోనని సోషల్ మీడియాలో అంతా డిస్కస్ చేసుకుంటున్నారు. అప్పుడే కరెక్ట్‌గా సందీప్ నెట్టింట పోస్ట్ పెట్టారు. స్టార్ హీరోయిన్‌కు చెందిన పీఆర్ టీమ్ తన స్టోరీని లీక్ చేసే ప్రయత్నం చేస్తోందంటూ ఆయన ఆరోపించారు. డర్టీ పీఆర్ గేమ్స్ అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఎక్స్‌లో పోస్ట్ పెట్టి మండిపడ్డారు. దర్శకుడిగా తాను కథ రాయడం కోసం ఎన్నో సంవత్సరాలు కష్టపడతానని, సినిమానే ప్రపంచమని చెప్పారు. “ఇటీవల నేను ఓ స్టార్ హీరోయిన్‌కు స్టోరీ చెప్పాను. 100% నమ్మకంతో వివరించాను. అప్పుడు అనధికారిక నాన్ డిస్ క్లోజర్ అగ్రిమెంట్ ఉన్నట్లే లెక్క. అందుకే స్టోరీని ఎవరికీ చెప్పకూడదు. కానీ లీక్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఒక యంగ్ హీరోయిన్ ఎదగకుండా చేయడం.. ఎంతో కష్టపడి రాసుకున్న నా కథను లీక్ చేయడం.. ఇదేనా ఫెమినిజం అంటే?” అంటూ ఫైర్ అయ్యారు. దీంతో దీపికను ఉద్దేశించే సందీప్ రెడ్డి వంగా పోస్ట్ పెట్టారని అంతా భావిస్తున్నారు. ఎందుకంటే దీపికను తప్పించాక బాలీవుడ్‌లో మూవీపై తప్పుడు ప్రచారం జరిగింది. అందుకే ఆమె కోసమని ఫిక్సయ్యారు. అయితే దీపికను తప్పించడానికి పలు కారణాలు ఉన్నాయని ఇప్పుడు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. రోజుకు ఆరు గంటలే వర్క్ చేస్తానని దీపిక చెప్పిందట. ఆ తర్వాత 100 రోజులకు మించి షూటింగ్ జరిగితే ఎక్స్ ట్రా రెమ్యునరేషన్ డిమాండ్ చేసిందని టాక్ వినిపిస్తోంది. అలా అనేక కండీషన్లు పెట్టారట అమ్మడు.

ఆ తర్వాత వాటన్నింటి ఫలితంగా సృజనాత్మక విభే దాలు తలెత్తడంతో వంగా ఆ నిర్ణయం తీసుకున్నారని వినికిడి. అదే సమయంలో కొన్ని నెలల క్రితం మదర్ ఫీల్డ్ లోకి వచ్చింది దీపిక. కాబట్టి ఏమైనా ఇబ్బందులు ఉంటే డైరెక్టర్ తో డిస్కస్ చేయాలి. కానీ సంబంధం లేదని కండీషన్స్ ను పెట్టడం కరెక్ట్ కాదని అనేక మంది నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ సినిమా నుంచి తనను తప్పించినా.. స్టోరీ లీక్ చేయడం అస్సలు కరెక్ట్ కాదని అంటున్నారు. ఏదేమైనా ఇప్పుడు దీపిక మ్యాటర్ హాట్ టాపిక్‌గా మారింది.

# సూపర్ స్టార్ సినిమాకు బాయ్‌కాట్ తిప్పలు..!



బాలీవుడ్ సూపర్ స్టార్ ఆమీర్ ఖాన్ సాలిడ్ సక్సెస్ దక్కించుకుని దశాబ్ద కాలం అయింది. ఆయన నుంచి వస్తున్న సినిమాలు ఇలా వచ్చి అలా వెళ్లి పోతున్నాయి. సక్సెస్‌లు లేకపోవడంతో సినిమాల సంఖ్య భారీగా తగ్గించాడు. చాలా ఏళ్ల క్రితం అమీర్ ఖాన్ నటించిన తారే జమీన్ పర్ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. విమర్శకుల ప్రశంసలు సైతం దక్కించుకుంది. విద్యా వ్యవస్థలో రావాల్సిన మార్పులను గురించి ఆ సినిమాలో చూపించడం ద్వారా జాతీయ స్థాయిలో ఆమీర్ ఖాన్ ఆ సమయంలో ప్రశంసలు దక్కించుకున్నారు. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్ అన్నట్లుగా సితారే జమీన్ పర్ అనే సినిమాతో ఆమీర్ ఖాన్ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. సితారే జమీన్ పర్ అనేది ఒక విదేశీ సినిమాకు రీమేక్. ఒరిజినల్‌గా తారే జమీన్ పర్ సినిమాకు సీక్వెల్ కాదు. కానీ తారే జమీన్ పర్ సినిమాకు సీక్వెల్ అంటే పబ్లిసిటీ కలిసి రావడంతో పాటు, ప్రేక్షకుల్లో బజ్ క్రియేట్ అవుతుంది అనే ఉద్దేశంతో ఇలాంటి ప్రచారం చేశారు. గత రెండేళ్లుగా ఈ సినిమా గురించిన ప్రచారం జరుగుతోంది. ఎట్టకేలకు ఈ సినిమాను వచ్చే నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. సినిమా విడుదల తేదీ సమీపిస్తున్న కొద్ది సినిమా చుట్టూ వివాదాలు చుట్టు ముడుతున్నారు. సినిమా విడుదల విషయంలో కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆమీర్ ఖాన్ విషయంలో చాలా మంది విమర్శలు చేస్తున్నారు. ఇటీవల ఇండియా–పాకిస్తాన్ మధ్య ఘర్షణ వాతావణం నెలకొంది. ఆ సమయంలో చాలా మంది బాలీవుడ్ స్టార్స్‌తో పాటు, ఇతర భాషల సినిమా తారలు పాకిస్తాన్ తీరును తప్పుబట్టడంతో పాటు, ఇండియన్ ఆర్మీ గురించి పాజిటివ్‌గా స్పందించారు. అంతేకాకుండా ఇండియాపై జరిగిన ఉగ్రదాడిని ఖండించారు. కానీ ఆమీర్ ఖాన్ నుంచి మాత్రం ఎలాంటి ప్రకటన రాలేదు. దాంతో కనీస బాధ్యతతో వ్యవహరించని ఆమీర్ ఖాన్ సినిమాను ఇండియన్స్ ఎందుకు ఆధరించాలంటూ కొందరు విమర్శలు చేస్తున్నారు. ఆమీర్ ఖాన్‌కి దేశ భక్తి లేదు, ఆయన ఇతర దేశం పైనే మక్కువ చూపుతున్నట్లు ఉన్నారు అంటూ కొందరు సితారే జమీన్ పర్ సినిమాను బాయ్‌కాట్ చేయాలంటూ పిలుపునిచ్చారు. సితారే జమీన్ పర్ సినిమా సీక్వెల్ కాదని, రీమేక్ అంటూ కూడా కొందరు బాయ్ కాట్ చేయాలని భావిస్తున్నారు. సినిమా విడుదల తేదీ సమీపిస్తున్నా కొద్ది ఈ వివాదం పెరుగుతున్న నేపథ్యంలో ఆమీర్ ఖాన్ ఎలా స్పందిస్తాడా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆమీర్ ఖాన్ సితారే జమీన్ పర్ సినిమా విడుదల చుట్టూ నెలకొన్న వివాదంపై ఆమీర్ ఖాన్ ఫ్యాన్స్, ఆయన సన్నిహితులు స్పందిస్తున్నారు. ఆమీర్ ఖాన్ గత మూడు నాలుగు ఏళ్లుగా సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. కానీ ఆయన నిర్మాణ సంస్థకు చెందిన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో ఉగ్ర దాడిని ఖండించడంతో పాటు, పాక్‌కి వ్యతిరేకంగా ట్వీట్స్ చేయడం జరిగింది. కనుక బాయ్ కాట్ అనేది సమంజసం కాదని అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు. విడుదలకు మరికొన్ని రోజులు మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో ఏం జరుగుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.


# విద్య, సంక్షేమ పథకాల సంస్కరణలకు ఆద్యుడు నందమూరి తారక రామారావు : జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** విద్య, సంక్షేమ పథకాల అమలులో సంస్కరణలు తీసుకు వచ్చి అమలు చేసిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వర్గీయ ఎన్.టి.రామారావు చిత్రపటానికి జ్యోతిప్రజ్వలన చేసి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయురాలు ఎన్. ఉమామహేశ్వరి ఎన్.టి.రామారావు జీవిత చరిత్రను తెలియజేయగా, భాగవతుల శిరీషారాణి వారి శ్రీ సాయి నాటక అకాడమీ విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ స్వర్గీయ పద్మశ్రీ నందమూరి తారక రామారావు జీవితం మనకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. కళారంగంలో కృష్ణుడు, కర్ణుడు వంటి పాత్రలకు ప్రాణం పోసి నటనలో అగ్రస్థానానికి చేరుకొని పద్మశ్రీ బిరుదు పొందారని తెలిపారు. 60 సంవత్సరాల వయస్సులో రాజకీయ ప్రవేశం చేసి పార్టీ స్థాపించిన ఆరు నెలలలో ఎన్నికలలో గెలుపొంది, ప్రభుత్వం ఏర్పాటుచేసి చరిత్ర సృష్టించిన వ్యక్తి నందమూరి తారక రామారావు అన్నారు. పరిపాలన వ్యవస్థలో సంస్కరణలు తీసుకు వచ్చి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రజల వద్దకే పరిపాలన తీసుకు వస్తూ మండల వ్యవస్థ ఏర్పాటు, విద్యారంగంలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు, ప్రజలకు రెండు రూపాయలకే కిలోబియ్యం, పేదవానికి గృహనిర్మాణం వంటి పథకాలను ప్రవేశపెట్టి, సంక్షేమ పథకాలు అమలులో దేశంలో ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచారన్నారు. ఎన్.టి. రామారావు జీవితం మనకు స్ఫూర్తిదాయకమని, 60 సంవత్సరాల వయస్సులో రాజకీయాలలో ప్రవేశించి విజయం సాధించి, విజయానికి, పట్టుదలకు మారుపేరుగా నిలిచారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేసి, జీవతంలో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు మాట్లాడుతూ కుమారుడితో పాటు కుమార్తెకు కూడా తండ్రి ఆస్తిలో వాటా కల్పిస్తూ చట్టం తీసుకువచ్చి అమలు చేసి, స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం అందించిన ఘనత నందమూరి తారక రామారావుకే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.డి.సి. సుబ్బలక్ష్మి, కె.మనోరమ, జిల్లా గణాంకాధికారి (సి.పి.ఒ.) జి.రామారావు, జిల్లా సప్లయి అధికారి కె.ఎల్. ఎన్.మూర్తి, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి బి.వి.రాణి, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్‌లు, కలెక్టరు కార్యాలయ ప్రాంగణంలోని కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# తపాల ఖాతా ఉంటే ఆధార్ లింక్ తప్పనిసరి

**- లింక్ లేకుంటే ప్రభుత్వ పథకాల డబ్బులు జమ కాకపోవచ్చు - పోస్టల్ అధికారులు స్పష్టీకరణ**



**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి డివిజన్ పరిధిలో తపాల ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేసినట్లు డివిజన్ పోస్టల్ సూపరిండెంట్ చుక్క శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 45 తపాల కార్యాలయాలు, 2 ప్రధాన తపాల కార్యాలయాలు, 559 శాఖ తపాల కార్యాలయాల్లో ఆధార్ లింకింగ్ కార్యక్రమం వేగంగా కొనసాగుతున్నదని చెప్పారు. డెబిట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) పథకాల లబ్ధిదారుల తపాల ఖాతాల్లో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ పిసిఐ) లింకు లేకపోవడం వల్ల ప్రభుత్వ నిధులు జమ కాకుండా అవరోధం ఏర్పడుతోందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉపకార వేతనాలు వంటి పథకాలు వచ్చే నెల నుంచే అమలులోకి రానుండగా, ఇంకా సుమారు మూడు లక్షల మంది లబ్ధిదారులు తమ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయలేదని వివరించారు. ఈ పరిస్థితిలో లబ్ధిదారులందరూ తక్షణమే తమకు సమీపంలోని తపాల కార్యాలయాల ద్వారా ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలని సూచించారు. లేదంటే ప్రభుత్వ సహాయం అందడంలో జాప్యం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. తపాల ఖాతాకు ఆధార్ లింకింగ్ చేయలేని వారు, ప్రత్యామ్నాయంగా ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపిపిబి) ఖాతా ప్రారంభించుకొని ప్రయోజనం పొందవచ్చని ఆయన సూచించారు.

# తెలుగు తేజస్సు ఎన్టీఆర్ జయంతి వేడుకలు : కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి




**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ నటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్.టి.ఆర్) జయంతిని కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు సినిమా రంగాన్ని తన నటనా ప్రతిభతో ప్రపంచానికి పరిచయం చేసిన ఎన్టీఆర్, తెలుగు దేశం పార్టీని స్థాపించి రాజకీయ రంగంలోనూ అజేయ నాయకుడిగా నిలిచారు. తెలుగు ప్రజల మనసుల్లో ఆయన 'అన్న'గా ఆదరాభిమానాలు పొందారు. ఆయన రాముడు, కృష్ణుడు వంటి పౌరాణిక పాత్రల ద్వారా తెలుగు ప్రజల హృదయాల్లో దేవతాస్వరూపంగా నిలిచారు. హిందీ, తమిళ, గుజరాతీ భాషలతో పాటు మొత్తం 303 సినిమాలలో నటించి, అనేక సినిమాలకు దర్శకత్వం వహించారు. 1982లో తెలుగు దేశం పార్టీని స్థాపించి, కేవలం 9 నెలల్లోనే అధికారాన్ని కైవసం చేసుకొని 10వ ముఖ్యమంత్రిగా పదవీ భాధ్యతలు చేపట్టి, మొత్తం 7 సంవత్సరాలపాటు ఆ పదవిలో కొనసాగారు అని తెలిపారు. కళాశాల చరిత్ర అధ్యాపకులు నాగేశ్వరరావు ఎన్టీఆర్ వేషధారణలో, కాషాయ వస్త్రాలు ధరించి, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారి వి.ఈశ్వర్, కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొని ఎన్టీఆర్‌కి ఘన నివాళులు అర్పించారు.

# బాలకృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**(రాజధాని వార్తలు):** చలనచిత్రం నటులు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారకరామారావు 102వ జయంతి శ్రీ పరమేశ్వరి జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవాధ్యక్షులు పొలిమేర నాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు 50 మందికి సూరిశెట్టి శివ అప్పారావు సూరిశెట్టి బల్లమ్మ చేతుల మీదగా మహిళా కార్మికులకు తోపుడు బండ్లు కార్మికులకు పంపిణీ చేశారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా పేదల సంక్షేమం కోసం తెలుగుదేశం ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాలు హరిజన గిరిజనులకు సమాజంలో వారు జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కిలో రెండు రూపాయలు బియ్యం పథకం ఉండడానికి ఇల్లు కొట్టుకోవడానికి బట్ట ఇచ్చిన ఘనత ఎన్టీఆర్ దేనిని, అటువంటి మహనీయులు అందరం కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన P4 పథకం వల్ల అనేకమందికి న్యాయం జరుగుతుందని సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో కొణతాల బాబురావు మల్ల గణేష్ మల్ల జగదీష్ శిలపరిశెట్టి శ్రీనివాసరావు సూరప్పారావు బుద్ధ మహాలక్ష్మి నాయుడు ఎలమంచిలి బంగారు రాజు ఆళ్ల ఆదినారాయణ విల్లూరి రమణ బాబు కోయిలాడ సత్యనారాయణ సోమిశెట్టి బల్లమ్మ యల్లపు జగన్నాధ రావు ఆళ్ల రవి కోరుకొండ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# కీర్తిశేషులు నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలు




**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జట్టపురెడ్డి తుని చింతలపాలెం గ్రామాలలో విశ్వవిఖ్యాత నటసార్వభౌమ చలనచిత్ర నటులు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు పురస్కరించుకొని ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఉమ్మడి విశాఖ జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి విచ్చేసి పార్టీ శ్రేణుల సమక్షంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు రమణమూర్తి మాట్లాడుతూ అన్నగారికి జోహార్ ఎన్టీఆర్ ఎన్టీఆర్ జోహార్ ఎన్టీఆర్ జోహార్ నినాదాలతో పార్టీ శ్రేణులు తమ అభిమానాన్ని చాటుకొని నివాళులర్పిస్తూ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ నందమూరి తారక రామారావు నటనగా ప్రజానాయకునిగా కోట్లాదిమంది ప్రజలు హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు అలాగే తన నటన రాజకీయ సామర్థ్యంతో తెలుగు వాడి గొప్ప తనం ప్రపంచంలో వ్యాపింపజేచారు ఎన్టీఆర్ మనదే మన దేశం చిత్రం నుండి సినీ రంగ ప్రవేశం చేశారు. అప్పటినుండి రాము డిగా కృష్ణుడుగా దుర్యోధనుడిగా కన్నుడిగా రావణాసురునిగా మొదలుకొని పౌరాణిక జానపద సాంఘిక చిత్రాలలో వివిధ పాత్రలలో జీవిస్తూ తెలుగు తమిళ కన్నడ హిందీ మొదలగు భాషల్లో మొత్తం 300 సినిమాలు పైగా నటించి సినిమాలకు వర్ణ తగ్గని కీర్తిని సంపాదించి పెట్టారు నటుడుగా నిర్మాతగా దర్శకుడుగా తెలుగు సినిమా రంగ చరిత్రలో తిరుగులేని కథానా యకుడిగా నిలిచిపోయారు. 1982లో తెలుగు ప్రజల కోరిక మేరకు సినీ రంగం నుండి రాజకీయ రంగప్రవేశం చేసి తెలుగు దేశం పార్టీ స్థాపించి 9 నెలలకే ముఖ్యమంత్రిగా ఎన్నికై చరిత్ర సృష్టించారు.

అటువంటి గొప్ప వ్యక్తి జయంతి వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పించిన రెండు గ్రామాలు తెలుగుదేశం పార్టీ నాయ కులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాజీ నిరంజన్ కుమార్ ఎంపీటీసీ సేక్ దర్గా మాజీ సర్పంచ్లు కర్రి దుర్గ నాయుడు మేడిశెట్టి వెంకటరమణ పాల సంఘం అధ్యక్షులు కసిరెడ్డి కన్నయ్య మండల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గంట యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకు నాయుడు ర్యాలీ రమేష్ మండల తిరిగి ఉపాధ్యక్షులు కొటారు సంతోష్ గొంతిరి నారాయణరావు భీమిలి నారాయణరావు మాజీ పాల సంఘం అధ్యక్షుడు కోన సురేష్ గ్రామ పార్టీ అధ్యక్షుడు పులివంతులు గణేష్ మరపురెడ్డి గిరిబాబు గ్రామ టీడీపీ పార్టీ ఉపాధ్యక్షులు యర్ర జ్యోతి కుమార్ కోన కృష్ణ పొతిని అప్పలస్వామి నాయుడు దంగేటి శ్రీనివాసరావు అప్పారావు మాస్టర్ టైలర్ తాతాజీ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని జోహార్ ఎన్టీఆర్ జోహార్ జోహార్ అంటూ నినాదాలు చేసి కార్యకర్తలందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

# లంక లితీష్ ఆధ్వర్యంలో ఘనంగా అన్న ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు

**- అన్నా ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మైలవరంలోని సెంటర్లలో భారీ కేక్ కటింగ్‌లు - అన్నా ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలను ఉపాధి కూలీల మధ్య ఘనంగా నిర్వహించిన టీడీపీ నాయకులు**





**ఎన్టీఆర్ జిల్లా, మైలవరం, (రాజధాని వార్తలు):** ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలం, మైలవరం గ్రామంలో అన్న నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలను లంక లితీష్ ఆధ్వర్యంలో బుధవారం మైలవరంలోని సెంటర్ల వద్ద,ఉపాధి కూలీల మధ్య భారీ కేక్ కటింగ్ ఏర్పాటు చేసి అన్నా ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బడుగు బలహీన వర్గాలకు రాజకీయం గా, తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని అఖండ భారతదేశానికి చాటి చెప్పిన అన్నా నందమూరి తారక రామారావు జయంతిని పుర స్కరించుకొని నాలుగు వందల మంది ఉపాధి కూలీల మధ్య, మైలవరంలోని నాలుగు రోడ్ల సెంటర్ల వద్ద, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాలనుసారంగా డిఇ నాగమల్లేశ్వరరావుచే భారీ కేక్ కటింగ్‌లు చేయించి, మిఠాయిలు పంచినారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తెలుగు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan